క్లుప్తంగా

ఘనంగా ఉర్సు ఉత్సవం


ఫాతెహా ఖ్వాజా గరీబ్ నవాజ్ జెండాను ఆవిష్కరిస్తున్న ముస్లింలు

కోటవురట్ల: హజ్రత్ ఖ్వాజా గరీబ్ నవాజ్ ఔలియా వారి 811వ ఉర్సు ఉత్సవాన్ని స్థానిక ముస్లిం వీధిలో శనివారం వైభవంగా నిర్వహించారు. మసీద్ ఉస్మాన్ ఘనీ, నవ జవాన్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ఈ సందర్భంగా మసీదు మౌలానా అజమత్ రజా మాట్లాడుతూ గరీబ్ నవాజ్ ఔలియా వారి బోధనలు అనుసరణీయమన్నారు. అనంతరం గరీబ్ నవాజ్ జెండా ఆవిష్కరించారు. ఖురాన్ పఠనం అనంతరం ప్రసాద వితరణ జరిగింది. పెద్ద సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు


జెడ్పీ హైస్కూల్ రోడ్డులో పొక్లయిన్‌తో చెత్తను తొలగిస్తున్న సిబ్బంది

కోటవురట్ల : కె.వెంకటాపురంలో శనివారం పారిశుధ్య పనులు నిర్వహించారు. జెడ్పీ హైస్కూల్‌కు వెళ్లే రహదారి పక్కనే భారీగా చెత్త పేరుకుపోవడంతో సర్పంచ్ పైల శ్రీదేవి మంగా ఇందిర భవానీ చర్యలు తీసుకున్నారు. పేరుకుపోయిన చెత్తతో దుర్వాసన వస్తుండడంతో పాటు దోమలు వ్యాప్తి చెందడంతో స్థానికులు చేసిన ఫిర్యాదుతో తొలగింపు చర్యలు తీసుకున్నారు. పొక్లెయిన్‌తో చెత్తను తొలగింపజేసి బ్లీచింగ్ చల్లించారు. పారిశుధ్యం మెరుగుకు దోహదపడాలని సర్పంచ్ కోరారు.

కొప్పగొండుపాలెంలో ధర్నా

రాంబిల్లి : కొప్పుగొండుపాలెంలో గల నేవీ గేటు వద్ద ఆయా గ్రామస్థులు శనివారం ధర్నాకు దిగారు. సర్పంచ్ బద్ది హరిబాబు ఆధ్వర్యంలో ఈ ధర్నా నిర్వహించారు. జీవన భృతి కేవలం మత్స్యకారులకే ఇస్తామని అధికారులు చెప్పడంతో తాము ధర్నాకు దిగామని సర్పంచ్ హరిబాబు అన్నారు. తాము కూడా నేవీ ఏర్పాటుతో జీవనోపాధి కోల్పోయామని, మత్స్యకారులతో పాటు తమకు కూడా జీవన భృతి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

మాజీ ఎమ్మెల్యే గోవిందరావుకు నివాళులు


మాట్లాడుతున్న సీపీఐ నేత మల్లికార్జునరావు

మునగపాక: ప్రజా సమస్యల పరిష్కారానికి మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ కోరుగంటి గోవిందరావు ఎంతో కృషి చేశారని సీపీఐ సీనియర్ నేత నాయుడు మల్లికార్జునరావు తెలిపారు. నాగులాపల్లిలో శనివారం గోవిందరావు వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. గోవిందరావు చిత్రపటానికి పలువురు నివాళులర్పించారు. మల్లికార్జునరావు మాట్లాడుతూ గోవిందరావు ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నేతలు మారిశెట్టి వరహా, శివ, రామచంద్రరావు, నాగేశ్వరరావు, సూరిబాబు, నారాయణరావు, జగదీశ్వరరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా వెంకన్న తిరువీధి


మునగపాక ఇందిరమ్మ కాలనీలో వేంకటేశ్వరస్వామి ఊరేగింపు

మునగపాక : స్థానిక ఇందిరమ్మ కాలనీలో శనివారం రాత్రి వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తి తిరువీధి నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళల కోలాటం అందరినీ ఆకట్టుకుంది. ఊరేగింపు కాలనీలోని ప్రధాన వీధి మీదుగా మెయిన్‌రోడ్డుకు చేరుకుంది. భక్తులు పెద్ద ఎత్తున శ్రీనివాసుడిని దర్శించుకున్నారు.

హోరెత్తిన శివనామస్మరణ


కోటవురట్లలోని శివాలయంలో మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు


పెనుగొల్లులో అభిషేకాలు అందుకుంటున్న వరాహ లింగేశ్వరస్వామి


నవగ్రహాలకు పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు


ఉపమాక లక్ష్మణేశ్వరాలయంలో దర్శనానికి క్యూలో వేచి ఉన్న భక్తులు


గోకివాడలో స్వయంభూ శివలింగం


వేమగిరి రుద్రభూమిలో ప్రతిష్ఠించిన పర్వమేశ్వరుని విగ్రహం

కోటవురట్ల: శైవక్షేత్రాలు శివనామస్మరణతో హోరెత్తాయి. మహా శివరాత్రి పర్వదినం పురస్కరించుకుని శనివారం మహాశివుడికి క్షీరాభిషేకాలు నిర్వహించారు. కోటవురట్లలోని శ్రీ ఉమారామలింగేశ్వర స్వామి, కైలాసపట్నంలోని శ్రీ రాజగోపాలస్వామి, యండపల్లి శివారు శ్రీ ఆత్మలింగేశ్వరస్వామి, చిన లింగాపురంలోని శ్రీ దుర్గా మల్లేశ్వర అయ్యప్ప స్వామి ఆలయాలలో విశేష పూజలు జరిగాయి. కోటవురట్లలోని శ్రీ ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు పూజలు చేశారు.

ఎస్.రాయవరం : స్థానిక బుగ్రేశ్వరస్వామి, సర్వసిద్ధి శ్రీ సిద్ధిలింగేశ్వరస్వామి, పెదఉప్పలం బ్రహ్మలింగేశ్వరస్వామి, దార్లపూడి రామలింగేశ్వరస్వామి , నర్సీపట్నం రోడ్డు రైల్వేస్టేషన్‌లో కాశీవిశ్వేరస్వామి , పెనుగొల్లు వరహానదిగట్టుపై వెలసిన వరాహాలింగేశ్వరస్వామి ఆలయాల్లో మహాశివునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. శివ దర్శనానికి భక్తులు ఆలయాల్లో పెద్ద ఎత్తున క్యూ కట్టారు. రాత్రికి రుద్రాభిషేకాలు నిర్వహించి జాగరణ మహోత్సవాలు నిర్వహించారు. వేమగిరి గ్రామంలో శివుని రుద్రభూమి ప్రదేశంలో శివుని విగ్రహం ప్రతిష్ఠించారు.

నవగ్రహాలకు పూజలు

నక్కపల్లి : ఓం నమఃశ్శివాయ అనే పంచాక్షరీ మంత్రంతో శివాలయాలు మార్మోగాయి. భక్తులంతా శివనామస్మరణతో బోళాశంకరుడ్ని దర్శించుకున్నారు. ఉపమాకలో ఉన్న లక్ష్మణేశ్వర స్వామి ఆలయం, ఒడ్డిమెట్టలో అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వరాలయం, గొడిచర్లలో శేషలింగేశ్వరాలయాలకు భక్తులు తరలివచ్చారు. తెల్లవారుజామున 3 గంటల నుంచే స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. ఉపమాక, ఒడ్డిమెట్టలలో ఉన్న నవ గ్రహాలయాల వద్ద, ధ్వజస్తంభాల వద్ద మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. నామవరంలో స్వయం భూరామలింగేశ్వరాలయం వద్ద లింగోద్భవ సమయంలో రుద్రాభిషేకం నిర్వహించారు. రాత్రి పార్వతీ పరమేశ్వరుల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల వద్ద అన్న సమారాధన కార్యక్రమం జరిగింది.

పాటిమీద శివాలయంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, డీసీఎంఎస్ మాజీ ఉపాధ్యక్షుడు అయినంపూడి మణిరాజు, సర్పంచ్‌లు సురేష్‌వర్మ, తళ్ల రోహిణీ భార్గవ్, ఎంపీటీసీ గొర్ల గోవిందు పరమేశ్వరుడ్ని దర్శించుకున్నారు.

రేవుపోలవరం తీరంలో పుణ్యస్నానాలు

ఎస్.రాయవరం : శివరాత్రి జాగరణ మహోత్సవానికి సిద్ధమయ్యే భక్తులు శనివారం ఉదయం రేవుపోలవరం తీరంలో సముద్ర స్నానమాచరించారు. మహిళలు అధిక సంఖ్యలో ఈ పుణ్యస్నానాలు చేశారు.

అచ్యుతాపురం(అనకాపల్లి): మండలంలోని చోడపల్లిలో పార్వతీపరమేశ్వరుల ఊరేగింపు నిర్వహించారు. అంతకు ముందు పార్వతీ పరమేశ్వరుల కళ్యాణం, రుద్రాభిషేకం చేపట్టారు. జగన్నాథపురం, హరిపాలెం, నునపర్తి శివాలయాలల్లో శివరాత్రి వేడుకలు భక్తిశ్రద్ధలతో జరిపారు.

మునగపాక : స్థానిక మెయిన్‌రోడ్డులో గల లింగరాయి గుడిలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగులాపల్లిలోని పురాతన శివాలయం ఉదయం నుంచి భక్తులతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. వాడ్రాపల్లి దక్షిణేశ్వరుని ఆలయంలోనూ శివరాత్రి పూజలు ఘనంగా జరిగాయి. సిరసపల్లిలోని వీరభద్రస్వామి గుడి, మెలిపాకలోని శివాలయం, మునగపాకలోని సాంబశివుని ఆలయాల్లో శివరాత్రి పూజలు వైభవంగా జరిగాయి.

రాంబిల్లి: దిమిలిలో చారిత్రక స్వయంభూ నగ్న లింగేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోకివాడలో స్వయంభూ శివలింగం వద్ద రాంబిల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత చంటిరాజు , వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పిన్నం రాజు కిషోర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరి ఆర్థిక సాయంతో భారీ అన్నసమారాధన నిర్వహించారు. కొత్తపట్నంలో మహాశివరాత్రి పూజల్లో సర్పంచ్ చోడిపిల్లి పార్వతి, చోడిపిల్లి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పాయకరావుపేట : మహాశివరాత్రి సందర్భంగా పట్టణంలో గల లింగాలకాలనీ, రాజుగారిబీడు, బృందావనం, మండలంలో గల పెద్దిరాజుపాలెం, గోపాలపట్నం, సీతమ్మవారి మెట్ట, పెంటకోట, పాల్మన్‌పేట, సత్యవరం గ్రామాల్లో గల శివాలయాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆయా ఆలయాల అభివృద్ధి కమిటీ సభ్యులు భక్తులకు తగు ఏర్పాట్లు చేశారు.తీర్థ ప్రసాదాలు అందించారు.

యలమంచిలి : మహాశివరాత్రి సందర్భంగా శనివారం స్థానిక కొత్తపేట రామలింగేశ్వరస్వామి ఆలయంలో భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. యలమంచిలి త్రిమూర్తుల స్వామి, కొమ్మాయిగుండం వద్ద ఉన్న శివపార్వతుల విగ్రహాల వద్ద, ఏటికొప్పాకలో శ్రీకాత్యాయని సమేత ఓంకారేశ్వరస్వామి, సోమలింగపాలెంలో సోమేశ్వర స్వామి, కొత్తపాలెంలో కాశీవిశ్వేశ్వర ఆలయం, బైపాస్ రోడ్డులో స్వామిస్కంధ ఆలయంలో వైభవంగా మహాశివునికి అభిషేకాలు, పూజలు జరిగాయి. పులపర్తి గ్రామాల్లో ఉన్న శివాలయాల్లో మహాశివరాత్రి పర్వదినాన్ని ఘనంగా నిర్వహించారు. యలమంచిలి కొత్తపేట శివాలయం పునర్నిర్మాణాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి పరిశీలించారు. శివాలయాల్లో పంచామృత అభిషేకాలు నిర్వహించారు.


లింగాలకాలనీ శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు


పాటిమీద శివాలయంలో స్వామివారిని దర్శించుకున్న నాయకులు


చోడపల్లిలో పార్వతీపరమేశ్వరులను ఊరేగిస్తున్న శివస్వాములు


యలమంచిలిలో రామలింగేశ్వరుని దర్శించుకొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి


మునగపాక లింగరాయి గుడిలో శివ పూజలు


తీరంలో సముద్ర స్నానాలు ఆచరిస్తున్న జాగరణ భక్తులు

గృహ సారథులు.. ప్రజలు, ప్రభుత్వానికి వారధులు


వెంకటనగరం సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు


పట్టణంలో గృహసారథులకు కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బాబూరావు

పాయకరావుపేట : ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల వద్దకు తీసుకెళ్లడానికి గృహసారథులు ప్రజలకు, ప్రభుత్వానికి వారధులుగా పనిచేస్తారని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. వైఎస్సార్‌సీపీ కన్వీనర్లు, గృహసారథుల సమావేశం మండలంలో గల వెంకటనగరం గ్రామంలో రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ చోడిపల్లి శ్రీను అధ్యక్షతన జరిగింది. పట్టణంలో గల పశుపతి కళ్యాణ మండపంలో కన్వీనర్లు, గృహ సారథులు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సమావేశాల్లో ఎమ్మెల్యే గొల్ల బాబూరావు మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలోనూ, ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలు ప్రవేశపెడుతున్నారన్నారు. అవినీతికి తావు లేకుండా లబ్ధిదారుల ఖాతాలో నగదు జమ అవుతుందన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం, సంక్షేమం కోసం రూ.2 లక్షల కోట్లు నిధులు ఇప్పటి వరకు విడుదల చేసిందన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో అనేక రంగాలు అభివృద్ధి చెందలేదన్నారు. ప్రస్తుతం రాష్ట్రం జగన్‌మోహన్ రెడ్డి పాలనలో ప్రతి ఒక్కరికీ ఏదో ఒక సంక్షేమ పథకం లబ్ధి కలుగుతోందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధిని కన్వీనర్లు, గృహ సారథులు స్వయంగా ప్రజల వద్దకు వెళ్లి వివరిస్తారన్నారు. మార్చి 18 నుంచి ప్రతి గ్రామంలోను పర్యటించి మా నమ్మకం నువ్వే జగన్ అనే నినాదంతో ప్రతి ఇల్లు తిరిగి ప్రచార కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇదే సమావేశంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు మాట్లాడుతూ స్థానిక మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత నియోజకవర్గంలో అభివృద్ధి జరగలేదని అనడం విడ్డురంగా వుందన్నారు. నాడు – నేడు ద్వారా పాఠశాలలు, పీహెచ్‌సీలు, సీసీ రోడ్లు, సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. గ్రామాల్లో పర్యటించి ఆమె చూడాలన్నారు. మండలంలో అన్ని గ్రామాల్లోను తాగునీరు, రోడ్లు నిర్మాణం, డ్రైనేజీలు నిర్మాణం దశల వారీగా పరిష్కరం జరుగుతుదన్నారు. పాయకరావుపేట పట్టణంలో మెయిన్‌రోడ్డు విస్తరణ, రోడ్ల నిర్మాణం, డ్రైనేజీల నిర్మాణం, తాగునీరు సమస్య పరిష్కారం చేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశాల్లో జెడ్పీటీసీ లంక సూరిబాబు, ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, సర్పంచ్ గారా ఉష శ్రీ ప్రసాద్, ఉప సర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, పార్టీ మండల అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, పట్టణ అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, లీడ్ క్యాప్ డైరెక్టర్ వేమగిరి కళ్యాణి లక్ష్మణ్, సోషల్ మీడియా మండల కన్వీనర్ డి.నానాజీ, బీసీ సెల్ మండల అధ్యక్షుడు పక్కుర్తి లోవకుమార్ పాల్గొన్నారు.

దళితుల సంక్షేమానికి అహర్నిశలు కృషి


డైరీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

ఎస్.రాయవరం : దళితుల సమస్యల పరిష్కారానికి అహర్నిశలు శ్రమిస్తున్నట్టు పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు తెలిపారు. డీహెచ్‌పీఎస్ డైరీని శనివారం కొరుప్రోలు క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్యే సంఘ సభ్యుల సమక్షంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దళితులు ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జేవీ ప్రభాకరరావు, గౌరవాధ్యక్షుడు రాజుబాబు, సమత సైనిక్‌దళ్ నాయకుడు గారా ప్రకాష్‌రావు పాల్గొన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవం


స్వామివారి రథోత్సవాన్ని ప్రారంభిస్తున్న వానపల్లి కోటేశ్వరరావు

అనకాపల్లిటౌన్ : శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 29వ ఆరాధన మహోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం గవరపాలెం కామాక్షమ్మదేవి ఆలయం నుంచి ఉత్సవ విగ్రహాన్ని పుర వీధుల గుండా ఊరేగించారు. ఈ సందర్భంగా కామాక్షమ్మదేవి ఆలయ కమిటీ అధ్యక్షుడు వానపల్లి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో స్వామివారి ఆరాధన మహోత్సవం, మహాశివరాత్రి పురస్కరించుకుని విజయరామరాజుపేట రైల్వే అండర్ బ్రిడ్జి వరకూ ఊరేగింపు నిర్వహించారు. రాత్రి 10 గంటలకు వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ వేడుక జరిపారు. ఆదివారం మధ్యాహ్నం అన్నసమారాధన చేయనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ గౌరవాధ్యక్షుడు ఎండపల్లి మోహన్ బ్రహ్మజీ, శాశ్వత గౌరవాధ్యక్షుడు కోసూరి మన్మధరావు, ఆలయ ప్రధాన కార్యదర్శి సింహాద్రి కోటేశ్వరరావు, కోశాధికారి ఎం.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి ఎడ్ల పోటీల విజేత అర్జునగిరి

బహుమతులు అందజేసిన డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు


దేవరాపల్లిలో హోరాహోరీగా ఉరకలేస్తున్న ఎడ్లు


కోలాట కళాకారులను అభినందిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల పరుగు పోటీల విజేతగా అర్జునగిరి మరిడిమాంబ ఎడ్లు ప్రథమ స్థానంలో నిలిచాయి. దేవరాపల్లి శివారు ఒడ్డు చింతల కల్లాల్లో దేముళ్లమ్మ పేరంటాలు తీర్థాన్ని పురస్కరించుకుని శనివారం నిర్వహించిన ఈ పోటీలు హోరా హోరీగా సాగాయి. జిల్లా వ్యాప్తంగా 25 ఎడ్ల బళ్లు పాల్గొన్నాయి. వీటిలో కె.ఎల్.బి. పట్నం సిరికి దుర్గాప్రసాద్ ఎడ్లు ద్వితీయ, చుక్కపల్లి మజ్జి రాజేష్ ఎడ్లు తృతీయ, లెక్కలవానిపాలెం పైడితల్లమ్మ ఎడ్లు నాలుగు, వావిలపాడు మరిడిమాంబ ఎడ్లు ఐదు, నర్సాపురం సంపత్‌వినాయక ఎడ్లు ఆరు, అర్జునగిరి మరిడిమాంబ ఎడ్లు ఏడో స్థానంలో నిలిచాయి. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు నగదు బహుమతులను ప్రదానం చేశారు. ముందుగా దేముళ్ల పేరంటాలను డిప్యూటీ సీఎంతోపాటు మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ వరదపురెడ్డి సింహాచలంనాయుడు, లలితానాయుడు, చల్లా తాతయ్యలు, ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి దర్శించుకున్నారు.

ఆకట్టుకున్న చిన్నారుల కోలాట ప్రదర్శన...

దేవరాపల్లి శివారు తగరంపూడి వారి కల్లాల వద్ద నాగమణి పేరంటాలు తీర్థం ఘనంగా జరిగింది. పేరంటాల అమ్మవారిని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మహిళలు, చిన్నారుల కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ ప్రదర్శనను ఆసక్తిగా తిలకించి అభినందించారు. మండల సచివాలయ, గృహసారథుల కన్వీనర్ కె.వి.రమణ, వేచలపు అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఘనంగా పోతురాజుబాబు తీర్థం

మాడుగుల: మహా శివరాత్రి పురస్కరించుకుని మాడుగుల సమీపంలో మామిడి వారి కల్లాల వద్ద పోతురాజుబాబు తీర్థం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. స్వామివారిని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఎడ్ల బళ్ల పరుగు పోటీలు, పలు క్రీడా పోటీలు నిర్వహించారు. ఎంపీపీ వేమవరపు రామధర్మజ, సర్పంచ్ యడ్ల కళావతి, ఎంపీటీసీ సభ్యురాలు పోలిమేర విజయలక్ష్మి, పోలిమేర చిన్నారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

వేడుకగా వడ్డాది వేంకటేశ్వర కల్యాణానికి పెళ్లిరాట


పెళ్లిరాట వేస్తున్న పెద్దలు

బుచ్చెయ్యపేట: ఉత్తరాంధ్రలోనే ప్రసిద్ధి గాంచిన వడ్డాది వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవానికి శనివారం పెళ్లిరాట వేశారు. వేదమంత్రాలు, డప్పులు, వాయిద్యాల నడుమ వందలాది మంది పేరంటాలు, పెద్దల సమక్షంలో కనుల పండువగా ఆలయ ముఖద్వారం వద్ద స్వామివారికి పెళ్లిరాట వేశారు. 149 సంవత్సరాలుగా మహా శివరాత్రి పర్వదినాన పెళ్లిరాట వేయడం ఆనవాయితీగా వస్తోంది. వచ్చే 2వ తేదీ నుంచి ఐదు రోజుల పాటు వేడుకగా నిర్వహించే స్వామివారి కల్యాణానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ అనువంశిక ధర్మకర్త దొండా కన్నబాబు, జెడ్పీటీసీ దొండా రాంబాబు, ఈవో టీఎస్ఎస్ శర్మ, కోఆపరేటివ్ అధ్యక్షుడు దొండా సన్యాసిరావు, దొండా శ్రీరామ్, కుబిరెడ్డి వెంకటరావు, అడపా నర్సింహమూర్తి, పాలిమేర కృష్ణ, బొబ్బురి ఈశ్వరరావు, సయ్యపురెడ్డి సత్యనారాయణ, కొండబాబు, కోరుకొండ రమణ, పిల్లా చందరావు పాల్గొన్నారు.

వజ్ర కవచాలంకృతునిగా ధ్యాన వేంకటేశుడు


వజ్ర కవచాలంకరణలో స్వామి వారు

కశింకోట : మహాశివరాత్రి సందర్భంగా ధ్యాన వేంకటేశ్వరస్వామిని వజ్ర కవచం, పూలమాలలతో అలంకరించి పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి.

బ్రహ్మకుమారీల ఆధ్యాత్మిక ప్రచారం


శివాలయంలో ప్రచారం చేస్తున్న బ్రహ్మకుమారీలు

కశింకోట : స్థానిక శివాలయంలో బ్రహ్మ కుమారీలు శనివారం ప్రచారం నిర్వహించారు. భక్తులకు ఆత్మ, పరమాత్మ గురించి వివరించారు. ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత పెరిగి, ఆరోగ్యవంతమైన జీవితం సాధ్యమవుతుందన్నారు. రాజయోగం, ధ్యానం ప్రాముఖ్యతను చార్టుల ద్వారా తెలిపారు. భక్తులు ఆసక్తిగా తిలకించారు.

కల్యాణ పోతురాజుబాబు ఉత్సవం నేడు

కశింకోట : మండలంలోని తీడ గ్రామంలో కల్యాణ పోతురాజుబాబు ఉత్సవం ఆదివారం నిర్వహించేందుకు పూర్తిస్థాయి ఏర్పాట్లు చేసినట్టు సర్పంచ్ చిరికి సత్యనారాయణ తెలిపారు. ఏటా శివరాత్రి మరుసటి రోజు జరిగే ఈ ఉత్సవంలో భాగంగా ఉదయం నుంచి ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. మధ్యాహ్నం గుర్రపు పరుగు పందాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పోటీలో గెలుపొందిన గుర్రాల నిర్వాహకులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థ బహుమతులుగా వరుసగా రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.7 వేలు, రూ.6 వేలు వంతున నగదు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఉత్సవం సందర్భంగా రాత్రి పలు సంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయనున్నట్టు పేర్కొన్నారు. శనివారం రాత్రి పోతురాజుబాబు జాగరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కోలాటాలు, బుర్రకథ తదితర కార్యక్రమాలు ప్రదర్శించారు.

పాతపాటి సర్రాజు మృతి తీరనిలోటు

తుమ్మపాల : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే పాతపాటి సర్రాజు అకాల మరణం తీరని లోటని అనకాపల్లి రాజపుత్ర సమాజ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్రకార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్ అన్నారు. ఆయన మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. క్షత్రియ సంక్షేమ సంఘం ప్రతినిధులు దంతులూరి వెంకటజగన్నాథరాజు, మందపాటి జానకిరామరాజు, పెనుమత్స వెంకటేశ్వరరావు, గణపతిరాజు, పిన్నమరాజు శ్రీనివాసరాజు, కొప్పెర్ల సత్యనారాయణరాజు, చేకూరి సుధాకర్‌రాజు, ఉప్పలపాటి మధు, మంతెన లీలావతి సంతాపం తెలిపారు.

కోళ్ల పందాలపై పోలీసుల దాడి

ఎస్.రాయవరం : పెనుగొల్లు ధర్మవరం సమీపంలో కోళ్ల పందాలపై దాడులు చేసి ఐదుగురు వ్యక్తుల నుంచి మూడు కోళ్లు , 12 బైకులు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ ప్రసాద్‌రావు శనివారం తెలిపారు. ముందస్తు సమాచారంతో సిబ్బందితో వెళ్లి దాడి జరిపినట్టు చెప్పారు. కేసు నమోదు చేశామన్నారు.

శివాలయానికి నాగాభరణం బహూకరణ

నర్సీపట్నం: మున్సిపాలిటీలోని 28వ వార్డులో వెలిసిన దక్షిణామూర్తి శివాలయానికి శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని జర్నలిస్టు చింతకల కిశోర్ దంపతులు రూ.50 వేలు విలువ నాగాభరణం బహూకరించారు. కౌన్సిలర్ చింతకాయల పద్మావతి సమక్షంలో అందజేశారు.